సాక్షి
కుమురం భీం
శనివారం, 15, జూన్, 2024


దహెగాంలో చిన్నారికి నివాళులర్పిస్తున్న ప్రజలు

వివరాలు లోపలి పేజీల్లో ▸

గరిష్టం/కనిష్టం
36.3 /28.4

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

కన్నీటి 'వలస'

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గురువారం జరిగిన భవన నిర్మాణ ప్రమాదంలో చింతలమానెపల్లి మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన ఆత్రం శంకర్, రుద్రాపూర్ గ్రామానికి చెందిన యేసంక హన్మంతు, చింతలమానెపల్లికి చెందిన గోలెం పోషం మృత్యువాతపడ్డారు. ఎలాంటి రక్షణ లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తుండగా ప్రహరీ కూలీ శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. ఈ ముగ్గురి కుటుంబాలు పొట్టచేత పట్టుకుని కూలీ పనికోసం మంచిర్యాల పట్టణానికి వలస వెళ్లినవే. ఇలా వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న వలస జీవుల జీవితానికి భరోసా లేకుండా పోతుంది. ప్రాణం పోయినా పట్టించుకునే వారు కరువవుతున్నారు.

- ఉపాధి కోసం పట్టణాలబాట పడుతున్న జిల్లావాసులు
- ప్రమాదకర పరిస్థితుల్లో పనులు
- ప్రాణాలు పోయినా పట్టించుకునే వారు కరువు
- రోడ్డున పడుతున్న బాధిత కుటుంబాలు
- స్థానికంగా ఉపాధి కల్పన ఉత్తమాటేనా..?


మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ముగ్గురు కూలీలు మృతి చెందిన ప్రాంతం

చింతలమానెపల్లి: ఉపాధి.. జీవన్మరణ పోరాటంలా మారుతోంది. కరువు కోరలు చాచే ఈ ప్రాంతంలో కట్టుకున్న వారికి.. కన్నవారికి కడుపు నిండా అన్నం పెట్టడమే కష్టమైంది. అవసరాల కోసం చేసిన అప్పులు గుదిబండలా మారుతున్నాయి. ఉపాధి కోసం పరాయి ప్రాంతానికి వెళ్లి ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తూ మృత్యుఒడికి చేరుతున్నారు. జిల్లాలో ప్రధాన ఆదాయ మార్గం వ్యవసాయం. కాగజ్‌నగర్ మినహా మరే ప్రాంతంలోనూ పారిశ్రామిక అభివృద్ధి లేదు. వర్షాకాలం మినహా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఉపాధి ఉండదు. నాలుగైదేళ్లు పండించిన పంటలకు గిట్టుబాటు లేదు.. చిరువ్యాపారులకు గిరాకీ లేదు. చేతివృత్తులకు ఆదరణ కరువైంది. ఈ క్రమంలో జిల్లా ప్రజలు ఉపాధి కోసం పట్టణాలు, నగరాల బాటపడుతున్నారు. సామాన్య ప్రజానీకం కడుపు నింపుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఉపాధి కోసం వలస
స్థానికంగా ఉపాధి లభించక వ్యవసాయ కూలీలు, చేతివృత్తులు చేసుకునే వారు, ఆర్థికంగా అప్పుల పాలైన వారు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. సిర్పూర్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల నుంచి మంచిర్యాల, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్లి పని వెతుక్కుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో అడ్డా కూలీలుగా మారుతున్నారు. రైస్ మిల్లుల్లో కార్మికులుగా, భవన నిర్మాణ పనుల్లో, రహదారుల నిర్మాణాలు, వాచ్‌మెన్లుగా కాలం వెల్లదీస్తున్నారు. వ్యవసాయ పనులు నిర్వహించే సమయంలో జూన్ నుంచి దసరా వరకు మాత్రమే స్థానికంగా ఉంటున్నారు.

ప్రమాదకర పరిస్థితుల్లో పనులు
ఉపాధి కోసం వలస వెళ్లిన వారు ఎలాంటి పరిస్థితుల్లోనైనా పని చేయాల్సి వస్తోంది. పనులు జరిగే ప్రాంతాలకు సమీపంలో తాత్కాలికంగా రోడ్ల పక్కన, పంట పొలాల్లో షెడ్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బరువైన బండరాళ్లు తొలగిస్తూ, ప్రమాదకర యంత్రాల వద్ద, కలుషిత వాతావరణంలో, ఎలాంటి రక్షణ చర్యలు పాటించని భవన, ప్రాజెక్టుల నిర్మాణ ప్రాంతాల్లో పనులు చేస్తున్నారు. ఎలాంటి పరిస్థితులున్నా పొట్టకూటి కోసం పని చేయడం తప్పదని కూలీలు పేర్కొనడం ఉపాధి దొరకడం ఎంత దుర్లభంగా మారిందో తెలియజేస్తోంది.

ప్రమాదాల్లో మృత్యువాత
ఉపాధి కోసం వెళ్లి మృత్యువాత పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇటీవల కౌటాల మండలం ముత్తంపేట, వీర్దండి గ్రామాలకు చెందిన ఇద్దరు మృతి చెందారు. ఒక్క సిర్పూర్ నియోజకవర్గంలోనే ఏటా 30 నుంచి 50 మంది వలస వెళ్లిన వారు మరణిస్తున్నారు. నీటిప్రాజెక్టులు, భారీ యంత్రాలు పనిచేసే చోట గల్లంతయినా ఆచూకీ లభించని వారు సైతం ఉన్నారు. వీరంతా పేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో ప్రభుత్వ యంత్రాంగం నుంచి కూడా మద్దతు లభించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మండుటెండల్లో పనులు చేస్తూ ఎండ దెబ్బ, అనారోగ్యంతో ప్రాణాలు కోల్పోయిన వారిని పట్టించుకునే వారులేదు. ఉపాధిహామీ పథకం అమలు చేస్తున్నా కుటుంబాల పోషణకు దాని ద్వారా ఆదాయం సరిపోదనేది వాస్తవం. చేతివృత్తులకు ఆదరణ లభించేలా.. యువతను ప్రోత్సహిస్తూ రుణాలు మంజూరు చేస్తే ప్రయోజనం ఉంటుంది. ముఖ్యంగా సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయితే ఉపాధి కోసం వలస వెళ్లే పరిస్థితి తప్పుతుంది.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా..



సిర్పూర్ నియోజకవర్గంలో ఉపాధి వసతులు పెంచడంపై దృష్టి పెడుతున్నాం. వలసలు వెళ్లిన ప్రాంతాల్లో మన ప్రజలు ప్రమాదాల బారిన పడడం ఆవేదన కలిగిస్తోంది. స్థానికంగా ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణంపై కృషి చేస్తున్నాం. ఉపాధి లేక ప్రజలు వలస వెళ్లడంపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా.
– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

ఆడపిల్లలకు రక్షణేది?

- పసిబిడ్డలను గద్దల్లా తన్నుకుపోతున్న పిశాచాలు
- పొత్తిళ్లలోని పిల్లలనూ ఎత్తుకెళ్లుతున్న కామాంధులు
- వికృత చేష్టలతో చిదిమేస్తున్న వైనం
- సుల్తానాబాద్ ఘటనతో ఉలిక్కిపడిన జిల్లా
- ఇటుక, రైస్‌మిల్లులు, భవన నిర్మాణం రంగంలో వలస కార్మికులే ఎక్కువ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, పెద్దపల్లి/దహెగాం: అప్పటివరకు అమ్మానాన్న ఒడిలో ఆడుకుంటున్న పిల్లలు అకస్మాత్తుగా మాయమై, విగతజీవులుగా మారితే.. అదిచూసిన కన్నోళ్ల పరిస్థితి ఏమిటి? ఆకాశంలో గద్దలు అకస్మాతుగా నేల మీదకు వచ్చి కోడిపిల్లలను తన్నుకుపోయినట్లుగా పొత్తిళ్లలో, తల్లి ఒడిలో నిద్రపోతున్న పసిపిల్లలను ఎత్తుకుపోతున్నారు. మద్యం, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటుపడినవారు సమాజానికి ముప్పుగా, పిల్లల పాలిట యమకింకరులుగా తయారయ్యారు. తాజాగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలో శుక్రవారం జరిగిన ఆరేళ్ల చిన్నారి అపహరణ, అత్యాచారం, ఆపై హత్య ఘటనతో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఉలిక్కిపడింది. ముక్కుపచ్చలారని చిన్నారిని మానవ మృగం చిదిమేసిన తీరు దిగ్భ్రాంతికి గురి చేసింది.

'వలస' బతుకులు అగమ్యగోచరం
వలస కార్మికుల బతుకులు అగమ్యగోచరంగా మారాయి. పనికి తగ్గ వేతనం, పని ప్రదేశాల్లో కనీస వసతులు మృగ్యమయ్యాయి. దీనికితోడు ఎప్పుడు ఎవరి నుంచి ఆపద ముంచుకొస్తుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. వలస కార్మికులు ఎంతమంది ఉన్నారు.. వారి భద్రతకు యాజమాన్యాలు తీసుకుంటున్న చర్యలేంటి.. పని ప్రదేశాల్లో వసతుల కల్పనపై పట్టించుకునే వారు కరువయ్యారు. ఏ అండ లేకపోవడంతో లైగింక వేధింపులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లోనే కేసులు నమోదవుతుండగా, చాలావరకు పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కకుండానే వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని, సెటిల్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా కాట్నపల్లి రైస్‌మిల్లులో పని చేయడానికి వచ్చిన కుటుంబాలకు వేర్వేరుగా వసతి గదులు, వాటికి తలుపులు లేకపోవడం వల్లే సంఘటన జరిగిందన్న చర్చ జరుగుతోంది.

కాట్నపల్లిలో ఏం జరిగింది?

- ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలానికి చెందిన దంపతులు తమ ఇద్దరు కూతుళ్లను తీసుకొని నెలరోజుల క్రితం కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్లులో పని చేసేందుకు వచ్చారు.
- గురువారం రాత్రి ఆరుబయట తమ ఇద్దరు పిల్లలతో నిద్రించారు.
- 10 గంటల సమయంలో వర్షం కురవడంతో గదుల్లోకి వెళ్లి, తమ పిల్లలను పడుకోబెట్టింది ఆ తల్లి.
- అప్పుడే కరెంట్ పోవడంతో మద్యం మత్తులో ఉన్న నిందితుడు పాప నోరుమూసి అపహరించాడు.
- నిందితుడు ఒక్కడే పాపను నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్తున్నట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది.
- అప్పటికే మద్యం మత్తులో ఉన్న నిందితుడు చిన్నారిపై అత్యాచారం చేసి, గొంతునలిమి చంపేశాడు.
- 11గంటల ప్రాంతంలో తల్లి పాప కనిపించడం లేదని, చుట్టుపక్కల వెతకడం ప్రారంభించింది.
- 12గంటల సమయంలో మిస్సింగ్‌పై పోలీసులకు సమాచారం అందించారు.
- పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చేపట్టారు.
- చిన్నారి ఫొటోను వాట్సాప్ గ్రూప్‌లు, సోషల్ మీడియాలో మిస్సింగ్ అయినట్లు ప్రచారం నిర్వహిస్తూనే గాలింపు ముమ్మరం చేశారు.
- సుమారు 2గంటల ప్రాంతంలో నిందితుడు దుస్తులు శుభ్రం చేసుకుంటుండగా పోలీసులు గుర్తించారు. అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా అత్యాచారం, హత్య విషయం వెలుగులోకి వచ్చింది.
- చిన్నారి మృతదేహన్ని ఆస్పత్రికి తరలించి, నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.
- శుక్రవారం సాయంత్రం 5గంటలకు నిందితుడి శిక్షించాలంటూ రాజీవ్ రహదారిపై కుటుంబ సభ్యులు, స్థానికులు ధర్నా నిర్వహించారు.
- సాయంత్రం చిన్నారికి పోస్టుమార్టం చేశారు. మృతదేహన్ని స్వస్థలానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

పక్కలో నుంచి ఎత్తుకుపోయి సంపిండు

మేము నెల కింద పని కోసం మిల్లుకు వచ్చాం. ఎప్పటిలాగే మా ఇద్దరు బిడ్డలతో కలిసి రేకుల కింద పడుకున్నం. వర్షం పడుతుండటంతో లోపలికి తీసుకుపోయిన. కరెంట్ పోవడంతో ఉక్కపోస్తోందని బయటకు వచ్చాం. పిల్లలను పడుకోబెట్టిన. రాత్రి 11 గంటలకు చూస్తే పాప కనపడలేదు. పక్కలో నుంచి ఎత్తుకపోయి సంపిండు. వాడిని విడిచిపెట్టొద్దు.
– మృతురాలి తల్లి ఆవేదన

నేనేం చేశాను పాపం!

నాకు ఆరేళ్లు.. మా అమ్మ నన్ను చాలా ప్రేమగా చూసుకునేది.. నాన్న చాలా గారాబం చేసేవాడు.. నా ఏడునెలల చెల్లితో బాగా ఆడుకునేదాన్ని.. చాలా సంతోషంగా ఉన్న జీవితంలో ఒక్కసారిగా ఇలా.. నేను ఏవరికి ఏం కీడు చేశాను? ఇది నా తప్పా? లేక సమాజం ఆలోచించే విధానంలో తప్పుందా? నా మాదిరిగా ఇంకా ఎంతమంది చిన్నారులు బలికావాలి? ఇప్పటికైనా మేలుకుంటుందా ఈ సమాజం? నా మాదిరిగా ఇంకా ఏ అమ్మాయికీ ఇలాంటి అఘాయిత్యం జరగకుండా చూడండి.. ఏం చేస్తే జరగకుండా ఉంటుందో? అని ఆలోచించి నిర్ణయం తీసుకోండి.. బాలికలను కాపాడండి.. నాలాంటి వాళ్లు ఈ సమాజంలో చాలామంది ఉన్నారు? మీకు తెలిసింది కొందరే.. సమాజం మారాలంటే ఎవరో దిగిరావడం కాదు.. మీలో మార్పు రావాలి.. ఆలోచించే విధానం మారాలి.. కొన్నిరోజులు బాధపడి వదిలేసే విషయం కాదు ఇది.. నా వయసు చూడండి.. నాకేం తెలుసని ఇలా చేశారు? నేనేం తప్పు చేశానని ఇలా నా బాల్యాన్ని దూరం చేశారు? నా జీవితాన్ని పసిప్రాయంలోనే చిదిమేశారు? అసలేం హక్కు ఉందని? నేను మీ కూతురిలా.. చెల్లిలా.. కనిపించడం లేదా? స్త్రీని దేవతగా పూజించే మనదేశంలో ఇంత దారుణ పరిస్థితులా? ఆడాళ్లుగా పుట్టడమే తప్పన్నట్లుగా కామానికి బలైపోతున్న నాలాంటి బాధితులు ఎందరో? వెలుగులోకి రాని ఘటనలు ఇంకెన్నో..? నిర్భయ.. దిశ.. వరంగల్ చిన్నారి.. ఇప్పుడు నేను.. ఈ జాబితాకు ముగింపు ఎన్నడో?
– 'హత్యా'చారానికి గురైన చిన్నారి ఆత్మఘోష

న్యూస్‌రీల్

ఆర్టీసీలో యూనియన్లు పునరుద్ధరించాలి


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, యూనియన్లను పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉపేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డిపో ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు అశోక్ యూనియన్ జెండా ఆవిష్కరించారు. ఉపేందర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ ఈయూ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర సాధనలో యూనియన్ కీలక పాత్ర పోషించిందన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పేస్కేల్ ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. ప్రస్తుత సీఎం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, అపాయింట్‌మెంట్ డేను ప్రకటించాలని కోరారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి దివాకర్, సహాయ కార్యదర్శి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు మోహన్‌బాబు, కార్మికులు ఇజాజ్, మధుసూదన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్న ఆశవర్కర్లకు మాత్రమే పరీక్ష

ఆసిఫాబాద్‌అర్బన్: వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్న ఆశ వర్కర్లకు పరీక్షకు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో తుకారాం భట్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహించొద్దంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశవర్కర్లు గురువారం చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఆయన స్పష్టతనిచ్చారు. సర్టిఫికెట్ కోసం ఇప్పటికే 50శాతం మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి మాత్రమే పరీక్ష ఉంటుందని స్పష్టం చేశారు.

20న నులిపురుగుల నివారణ కార్యక్రమం

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 20 నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమం నిర్వహణపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల పిల్లలు జిల్లాలో 1,73,494 మంది ఉన్నారని, వీరందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. విద్యా, వైద్యారోగ్య, పంచాయతీరాజ్, శిశుసంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఏదైనా కారణంతో ఈ నెల 20న మాత్రలు తీసుకోకుంటే ఈ నెల 27 వరకు మరో అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు మాత్రలు అందించే ముందు వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులతో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్యశాఖ, మున్సిపల్ అధికారులు సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధులు అరికట్టాలన్నారు. డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ప్రతిరోజూ జ్వరాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే బృందాలు రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు, పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థుల ఆరోగ్యాన్ని పరీక్షించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆయా సమావేశాల్లో డీఎంహెచ్‌వో తుకారాం, డీఆర్‌డీవో సురేందర్, డీపీవో భిక్షపతి, జిల్లా విద్యాశాఖ లైజన్ అధికారి ఉదయ్‌బాబు, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి సజీవన్, బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి, ధరణి దరఖాస్తులు పరిష్కరించాలి


వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రజావాణి, ధరణి కార్యక్రమాల ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత అధికారుల సమన్వయంతో సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రత్యేక డ్రైవ్ ద్వారా 1.38 లక్షల దరఖాస్తులు పరిష్కరించామని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దరఖాస్తులు ఎక్కువగా ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని సూచించారు. అలాగే రాష్ట్రస్థాయిలో ప్రతీ మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూసంబంధిత దరఖాస్తులను కలెక్టర్లకు బదిలీ చేస్తున్నామని తెలిపారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంచేందుకు ప్రభుత్వం యోచిస్తుందని, భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ వివరాలతో నివేదిక అందించాలన్నారు. నూతన సబ్ రిజిస్టర్ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన భవనం, స్థలం కేటాయించి ప్రతిపాదనలు పంపించాలన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే మాట్లాడారు. జిల్లాలో ధరణి పోర్టల్ ద్వారా 2,059 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలుగు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన భూసమస్యల దరఖాస్తులు పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, తదితరులు పాల్గొన్నారు.

కమిటీల నియామకంలో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న కేశవ్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నూతన కమిటీల నియామకంలో సీనియర్ నాయకులు భాగస్వాములు కావాలని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రేగుంట కేశవ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 30 వరకు గ్రామ, వార్డు, మండల, డివిజన్, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని వివిధ విభాగాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 15 నుంచి 30 మంది వరకు జిల్లాస్థాయి కమిటీలో ప్రాతినిధ్యం ఉండాలన్నారు. మండల కమిటీల అనంతరం జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుత కమిటీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జూలై 6న ప్రతీ గ్రామంలో జెండా ఆవిష్కరించాలన్నారు. జూలై 7న వరంగల్‌లో జరిగే సభకు ఉమ్మడి జిల్లా నుంచి తరలివెళ్లేందుకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఎంపీఎస్ నాయకుడు నందకుమార్, జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు విద్యార్థుల ఎంపిక


లక్కీడ్రా తీయిస్తున్న అదనపు కలెక్టర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో ప్రవేశాలకు 2024– 25 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులను లక్కీడ్రా పద్ధతిలో ఎంపిక చేశామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం అదనపు కలెక్టర్ దాసరి వేణు(రెవెన్యూ), డీటీడీవో రమాదేవితో కలిసి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో లక్కీడ్రా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 3, 5, 8 తరగతుల కోసం 33 మందిని ఎంపిక చేశామని తెలిపారు. మూడో తరగతిలో ఇద్దరు, ఐదో తరగతిలో ఒకరు ఆదిమ గిరిజనులు, షెడ్యూల్డ్ ఏరియాల నుంచి 3, 5, 8 తరగతులకు ఒక్కొక్కరు చొప్పున.. అలాగే సాధారణ విద్యార్థులను మరో 27 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచిత భోజన, విద్య, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి మీనారెడ్డి, ఏసీఎంవో ఉద్ధవ్, సహాయ గిరిజన అధికారి క్షేత్రయ్య, జెడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలకు రంగం సిద్ధం !

- ఐఏఎస్, ఐపీఎస్ నుంచి కింది స్థాయి వరకు
- ఉమ్మడి జిల్లా అధికారులకు స్థాన చలనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి అధికారుల వరకు బదిలీలు జరగనున్నాయి. ఈ మేరకు ఉన్నతస్థాయిలో బదిలీల జాబితా రూపొందుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అన్ని శాఖల్లోనూ అధికారులకు స్థాన చలనం కలిగింది. సొంత జిల్లా, మూడేళ్ల సర్వీసు తదితర నిబంధనలతో ఇతర జిల్లాల నుంచి అనేక మంది విధుల్లో చేరారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేస్తున్నారు. పోలింగ్, ఫలితాలు వెల్లడి, కోడ్ ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనపై దృష్టి సారించింది.

రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు
రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల్లో భాగంగా కలెక్టర్ల నుంచి ఐపీఎస్‌ల వరకు స్థాన చలనం కలిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉమ్మ డి జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సీపీ, డీసీపీ, ఎస్పీ, ఏసీపీలు, డీఎస్పీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సీఐలు, ఎస్సైలతోపాటు ఇతర శాఖల్లోని సిబ్బంది బదిలీలు జరిగే జాబితాలో ఉన్నారు. జిల్లా, డివిజనల్, మండల స్థాయి అధికారులకు తమ సొంత జిల్లాలకు లేదా కోరుకున్న చోట పోస్టింగ్‌ల కోసం ఇప్పటికే వినతులు, పైరవీలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నేడో రేపో భారీగా అధికారుల బదిలీలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న వారిలో కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబా ద్ ఉమ్మడి జిల్లా నుంచి అధికంగా ఉన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యోగులు, గతంలో పని చేసిన వారంతా తిరిగి ఇక్కడి రావాలని ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఆయా ఉ ద్యోగ సంఘాల నేతలు, తెలిసిన ప్రజాప్రతినిధులతో సిఫారసులు చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాకు మళ్లీ పాత అధికారులే ఎక్కువగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నట్లు తెలుస్తోంది.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన(ఆసిఫాబాద్): నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశం కోసం అర్హులైన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 150 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ విభాగంలో 30, మెకానికల్ 30, సివిల్ 30, కంప్యూటర్స్ 30, మైనింగ్ విభాగంలో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత పొందిన సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూలై 2న నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

ఖర్జెల్లి ప్రధానోపాధ్యాయుడిపై విచారణ!

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొహిసిన్‌పై శనివారం విచారణ నిర్వహించనున్నారు. పాఠశాలలో నిధుల దుర్వినియోగం, విధుల్లో నిర్లక్ష్యం, అధికారులను తప్పుదోవ పట్టించడంపై పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం జరగాల్సిన విచారణ శనివారం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఈవిషయంపై ఎంఈవో సోమయ్యను వివరణ కోరగా విచారణ నిర్వహిస్తున్నామని వివరాలు విచారణ అనంతరం తెలియజేస్తామన్నారు.

కేంద్రమంత్రులను కలిసిన బీజేపీ అధ్యక్షుడు


కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న రఘునాథ్

మంచిర్యాల టౌన్: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌లను జిల్లా బీజేపీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి శుక్రవారం కలిశారు. కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని బొగ్గు గని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. రవీందర్‌రావు, జాజు, అక్కల సుధాకర్, మాధవరపు రమణరావు, బియ్యాల సతీశ్‌రావు, గడ్డం స్వామిరెడ్డి పాల్గొన్నారు.

రాజ్‌కుమార్‌కు గవర్నర్ ప్రశంస


పురస్కారం అందిస్తున్న మంత్రి ప్రభాకర్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ వీటీసీలో ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న దేవతల రాజ్‌కుమార్(హెచ్‌ఓఎం)కు గవర్నర్ ప్రశంసపత్రం లభించింది. ఎక్కువ సార్లు రక్తదానం చేసిందుకు గాను ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ప్రశంసాపత్రం అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బీ.వెంకటేశం చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ వీటీసీ మేనేజర్ రామారావు తదితరులు హాజరయ్యారు.

మహిళా సంఘాలను ప్రోత్సహించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: మహిళా సంఘాలు స్వశక్తితో ఎదిగేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం మహిళా సంఘాల అభివృద్ధి, స్త్రీనిధి రుణాలు, బ్యాంకు లింకేజీలపై బ్యాంకు అధికారులు, సెర్ప్, మెప్మా సిబ్బంది, డీఆర్‌డీఏ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక మహిళా సంఘాలు చేపల పెంపకంపై దృష్టి సారించేవిధంగా ప్రోత్సహించాలన్నారు. బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలు వందశాతం పూర్తి కావాలన్నారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ల పని తీరుపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
OLD AGE HOME
■ఓమెగా హోంకేర్ సెంటర్ / ఇంటివద్ద చేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్ 8977639664 / 8977639665
[H-799891]

WANTED
■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217
[M-1185211]

www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888, 9010299065,
9951602823, 9010608462,

'కడెం'.. రెడీ..


కడెం ప్రాజెక్ట్


మరమ్మతు పనులు చేస్తున్న మెకానికల్ సిబ్బంది


పనులను పర్యవేక్షిస్తున్న సీఈ శ్రీనివాస్

- తుది దశకు చేరిన ప్రాజెక్టు మరమ్మతు పనులు
- పనులు పర్యవేక్షిస్తున్న చీఫ్ ఇంజినీర్
- ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే బొజ్జు భరోసా

కడెం: రెండేళ్లుగా వానాకాలం భారీ వరదలతో దడ పుట్టించి.. పరుగులు పెట్టించిన కడెం ప్రాజెక్ట్ ఈ ఏడాది వచ్చే నీటిని నిల్వ చేసేందుకు సిద్ధమైంది. 2022లో వరదలు వచ్చి ప్రాజెక్ట్ డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. అప్పటి ప్రభుత్వం మరమ్మతులు చేయించలేదు. 2023 వానాకాలంలో మళ్లీ భారీ వరదలు వచ్చి ప్రాజెక్ట్‌ను అతలాకుతలం చేశాయి. వరదలకు దెబ్బతిన్న ప్రాజెక్ట్ మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంతో నాలుగు నెలలుగా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. వరద గేట్ల మరమ్మతు పనులు తుది దశకు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. సీఈ శ్రీనివాస్ వారంలో రెండు రోజులుగా కడెంలోనే ఉంటూ మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్నారు.

తుది దశకు పనులు

కడెం ప్రాజెక్ట్ వరద గేట్ల మరమ్మతు పనులకు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 29న రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. నాలుగు నెలల నుంచి చేపట్టిన మరమ్మతు పనులు 90 శాతం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వరద గేట్లకు కొత్త రూలర్స్, రబ్బర్ సీల్స్, గేర్ బాక్స్‌లు, బ్రేక్ లైనర్స్ అమర్చారు. కొన్ని వరద గేట్లకు కొత్త మోటార్లు బిగించారు. సివిల్ వర్క్‌లో భాగంగా స్పిల్‌వే పనులు, ఆప్రాన్, వాల్స్ పనులు పూర్తయ్యాయి. కొన్ని మైనర్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

కౌంటర్ వెయిట్ బిగించాలి

వరద గేట్ల పనులు చివరి దశకు చేరినా ప్రాజెక్టు 2వ, నంబర్ వరద గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. కౌంటర్ వెయిట్‌ను ప్రాజెక్టు వద్ద తయారు చేసి సిద్ధంగా ఉంచారు. దానిని బిగించేందుకు నట్ బోల్ట్‌లు అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరుగుతోంది. బెంగుళూరుకు చెందిన హిల్టీ అనే సంస్థ నట్, బోల్ట్స్ తయారు చేస్తోందని, నట్ బోల్ట్స్ రాగనే కౌంటర్ వెయిట్‌ను బిగిస్తామని అధికారులు తెలిపారు.

కొనసాగుతున్న ఎలక్ట్రికల్ పనులు

ప్రాజెక్టు లక్ట్రికల్ వ్యవస్థ పునరుద్ధరణ నిమిత్తం మార్చి 15న, రాష్ట్ర ప్రభుత్వం రూ.3.81 కోట్లు మంజూరు చేసింది. ఇన్నేళ్లుగా కడెం మండల కేంద్రం ఫీడర్ నుంచి ప్రాజెక్టుకు విద్యుత్ సరాఫరా అయ్యేది. ఈ ఫీడర్‌లో తరచూ సమస్యలు తలెత్తేవి. దీంతో ప్రాజెక్టుకు మిషన్ భగీరథకు సంబంధించి ఫీడర్ ద్వార సరాఫరా ఇచ్చేందుకు 500 కేవీ నూతన ట్రాన్స్ ఫార్మర్‌తో ప్రాజెక్టు గేజ్ రూం వరకు ప్రత్యేక లైన్ వేశారు. కొత్త జనరేటర్ రావడంతో ప్రస్తుతం మూడు జనరేటర్లు అందుబాటులో ఉన్నాయి. ఇంకా కొన్ని పనులు కొనసాగుతున్నాయి.

పనులు పూర్తయ్యాయి

కడెం ప్రాజెక్టు వరద గేట్ల రోలర్స్, రబ్బర్ సీల్స్, గేర్ బాక్స్‌లు, బ్రేక్ లైనర్స్ తదితర మరమ్మతు పనులు పూర్తయ్యాయి. 2వ నంబర్ గేటుకు కౌంటర్ వెయిట్ బిగించాల్సి ఉంది. నూతన విద్యుత్ లైన్, జనరేటర్, ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశాం. కొన్ని ఎలక్ట్రికల్ పనులు కొనసాగుతున్నాయి.

– విఠల్, ఈఈ, కడెం ప్రాజెక్టు

ఆయకట్టు రైతులకు అండగా..

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి కడెం ప్రాజెక్టు మరమ్మతులకు రూ.9.21 కోట్లు మంజూరు చేసింది. సకాలంలో ప్రాజెక్టు మరమ్మతు పనులు పూర్తవుతున్నాయి. ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని విడుదల చేస్తాం. ఆయకట్టు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

– వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే

కార్మిక సంఘాల ఆందోళన


రహదారిపై బైఠాయించిన కార్మిక సంఘాల నాయకులు


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు


ఎమ్మెల్యే హరీశ్‌బాబు పరామర్శ

- బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ధర్నా
- చర్చలు సఫలమవ్వడంతో ఆందోళన విరమణ
- మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ప్రహరీ కూలి మృతిచెందిన కూలీల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట రహదారిపై ఆందోళన చేపట్టారు. ఏనంక హన్మంతు, ఆత్రం శంకర్, గోలెం పోషం మృతదేహాలను పోలీసులు గురువారం సాయంత్రం ఆస్పత్రికి తరలించిన విషయం తెలిసిందే. శుక్రవారం వందలాదిగా భవన నిర్మాణ రంగం కార్మికులు తరలివచ్చారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రి ప్రాంగణంలో మిన్నంటాయి. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలంటూ భవన నిర్మాణ సంఘాల నాయకులు, కార్మికులు ఆస్పత్రి ఎదుట గంటన్నరపాటు బైఠాయించారు. న్యాయం చేసే వరకు పోస్టుమార్టం చేయనివ్వబోమంటూ ఆందోళనకు దిగారు. రహదారికి ఇరువైపు కిలోమీటరు దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఏసీపీ ప్రకాష్, సీఐ బన్సిలాల్ ఆందోళనకారులతో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భరోసానివ్వడంతో ఆందోళన విరమించారు.

రాత్రి నుంచే చర్చలు

కార్మిక సంఘాలు, భవన నిర్మాణ సంఘం నాయకులు మధ్యవర్తిత్వం వహించి కుటుంబాలకు న్యాయం చేసేందుకు భవన యజమాని చంద్రయ్యతో గురువారం రాత్రి నుంచే చర్చలు జరిపారు. మృతుల కుటుంబాలకు రూ.6.50లక్షల చొప్పున, గాయపడిన రాములు కుటుంబానికి రూ.2లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదరడంతో ఆందోళన విరమించారు.

ఎమ్మెల్యేల పరామర్శ

మృతుల కుటుంబాలను మంచిర్యాల ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శుక్రవారం ఆస్పత్రి వద్ద పరామర్శించారు. సీఐతోపాటు కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐని ఆదేశించారు. రూ.2లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. భవన యజమానులతో మాట్లాడి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సూచించారు.

నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

చెన్నూర్‌రూరల్: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. మండలంలోని లంబడిపల్లి, పొక్కూరు గ్రామాల్లో జైపూర్ సబ్ డివిజన్ పోలీసు, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా 42లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, తయారీకి సిద్ధంగా ఉన్న 2100లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఎనిమిది మందిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు, నేరస్తులు ఆశ్రయం తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా నిషేధిత పత్తి విత్తనాలు, గంజాయి అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ హరి, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, చెన్నూర్ ఎస్సై వెంకటేశ్వర్‌రావు, భీమారం ఎస్సై రాములు, పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి


ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: పదోన్నతి పొందిన ఉద్యోగులు మరింత బాధ్యతగా పనిచేయాలని ఆర్కే 6 గని మేనేజర్ ఈ.తిరుపతి తెలిపారు. శుక్రవారం గనిలో 77 మంది కార్మికులకు యాక్టింగ్ ప్రమోషన్లు అందజేశారు. గనిపై జరిగిన కార్యక్రమంలో కోల్‌కట్టర్, సపోర్ట్ మెన్, ట్రామర్, లైన్‌మెన్, మేషన్, ఫ్యాన్ ఆపరేటర్, హెల్పర్‌తోపాటు టబ్ రిపేర్ మజ్దూర్ తదితర ప్రమోషన్ పత్రాలను సంబంధిత ఉద్యోగులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం యాక్టింగ్ ప్యానల్ లిస్ట్ ఆధారంగా ప్రమోషన్లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గని రక్షణ అధికారి కాదాసీ శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రామ్‌నరసయ్య, డిప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, పిట్ ఇంజినీర్ శ్యాం, సీనియర్ పర్సనల్ అధికారి సునీల్‌కుమార్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, కేంద్ర కమిటీ నాయకులు ముస్కె సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి


రజిత మృతదేహం

లక్సెట్టిపేట: మండలంలోని పాతకొమ్ముగూడెం గ్రామానికి చెందిన రజిత(24) ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి చెందింది. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రజిత గురువారం ఉదయం బహిర్భూమికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు గాలించగా శుక్రవారం దొడపల్లి గ్రామ శివారులోని బావిలో మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి మృతి చెందినట్లుగా ఎస్సై తెలిపారు. మృతురాలి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చెన్నూర్ యువకుడు రామప్ప చెరువులో మృతి

చెన్నూర్/వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని రామప్ప చెరువులో శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానిక మత్స్యకారులు చేపల వేట కోసం చెరువులోకి వెళ్తున్న క్రమంలో బోటింగ్ పాయింట్ వద్ద మృతదేహం తేలుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై చల్లా రాజు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. చెరువు కట్టపై అనుమానాస్పదంగా ఉన్న బైక్‌ను గుర్తించి బండిపై ఉన్న నంబర్ ఆధారంగా చెన్నూరుకు చెందిన గూజర్ చందన్‌సింగ్(29)గా గుర్తించి వెంకటాపురం పోలీసులకు సమాచారం అందించారు. కాగా, 11రోజుల క్రితం అదృశ్యమైన చందన్ రామప్ప చెరువులో మృతిచెందడం.. మొహంపై గాయాలు ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

జీరో విద్యుత్ ప్రమాదాలే లక్ష్యం

ఆసిఫాబాద్‌అర్బన్: జీరో విద్యుత్ ప్రమాదాలే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ వాసుదేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గృహాల్లో నాసిరకం వైరింగ్, పరికరాలు వినియోగించడం, వ్యవసాయ రంగంలో స్విచ్ బోర్డులు, మోటార్ స్టార్టర్ల వద్ద భద్రత పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనుమతి ఉన్న అధికారి మాత్రమే లైన్ క్లియర్ ఇవ్వాలని సూచించారు. టీజీఎస్ పీడీసీఎల్‌లో తాజా ప్రమాణాల భద్రతా విధానాలతో ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సిబ్బందికి అన్ని రకాల భద్రతా పరికరాలు అందిస్తున్నామని తెలిపారు.

ఖాళీలను భర్తీ చేయాలి

కెరమెరి(ఆసిఫాబాద్): ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని ఆదివాసీ విద్యార్థి సంఘం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు మడావి భరత్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోర్ దాదిరావ్ కోరారు. ఈ మేరకు ఉట్నూర్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు శుక్రవారం వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఏళ్లుగా టీచర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతుందన్నారు. అలాగే పెసా కోఆర్డినేటర్ల పోస్టులు భర్తీ చేయాలని కోరారు. సంఘం గాదిగూడ మండల అధ్యక్షుడు సంతోష్, సంజీవ్ తదితరులు ఉన్నారు.

నీటి సమస్యలుంటే తెలుపాలి

లక్సెట్టిపేట: మిషన్ భగీరథ నల్లా నీటిపై సమస్యలుంటే తెలుపాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్, తిమ్మాపూర్, జెండావెంకటాపూర్ గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. తాగునీటి సమస్యలు, నల్లా నీరు సక్రమంగా వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి నీరు వస్తుందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రసాద్, కార్యదర్శి దుర్గాదేవి, గ్రామకుమార్ పాల్గొన్నారు.

తాటిచెట్టుపై పిడుగు


తాటిచెట్టుపై మంటలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): మండలంలోని గొంట్లపేట్ గ్రామంలోని తాటిచెట్టుపై శుక్రవారం మధ్యాహ్నం పిడుగుపడింది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉరుములు మెరుపులతోపాటు ఈదురు గాలులు వీచాయి. రైతులు సాగు పనులు చేస్తున్న సమయంలో భారీ శబ్దంతో పిడుగు పడి తాటిచెట్టుపై మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలోని కూలీలు, రైతులు భయాందోళనకు గురయ్యారు.

రోటావేటర్‌కింద పడి డ్రైవర్ మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలో ట్రాక్టర్ రోటావేటర్ కింద పడి డ్రైవర్ బిరినేని మాంతయ్య(40) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెన్నెల మండలం చిత్తాపూర్ గ్రామానికి చెందిన మాంతయ్య తన అత్తగారి ఊరైన చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామంలో గత ఆరేళ్లుగా ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం పంట పొలంలో ట్రాక్టర్ రోటావేటర్‌తో పనులు చేస్తుండగా అకస్మాత్తుగా రోటావేటర్ కింద పడి మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఎమ్మెల్యే వినోద్‌కు మంత్రి పదవి ఇవ్వాలి


మాట్లాడుతున్న రాముునాయక్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కౌన్సిల్ ఫోరం చైర్మన్ రాముునాయక్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డికి రిజిష్టర్ పోస్టు ద్వారా విజ్ఞాపన పత్రాలు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందిస్తూనే కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ఎంతగానో పాటు పడ్డారని, నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీ తీసుకురావడంలో వినోద్ చేసిన కృషి మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొక్కెర చంద్రశేఖర్, నీలి కృష్ణ, అఫ్సర్, కాంగ్రెస్ శ్రేణులు ఎలిగేటి శ్రీనివాస్, మంగమూర్తి, సముద్రాల మురళి, బిజీ శంకర్‌సింగ్, నెల్లి రమేష్, యూనస్ తదితరులు పాల్గొన్నారు.

పర్సనల్ రికార్డులు సరి చేయాలి


సమీక్ష నిర్వహిస్తున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: ఉద్యోగుల పర్సనల్ రికార్డులు సరిచేయాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో ఏరియా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల పర్సనల్ రికార్డులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, ఫొటోలు, ఇన్కమ్ టాక్స్, పాన్ నంబర్, ఆధార్ నంబర్ తదితర వివరాలన్నీ రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఏమైనా పొరపాట్లు ఉంటే కూడా సరి చేయించాలని అన్నారు. దీర్ఘకాలికంగా గైర్హాజరవుతున్న ఉద్యోగులను గనులపై పిలిపించి ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తూ సక్రమంగా విధులకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం పర్సనల్ అరవిందరావు, పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు దేవేందర్‌రెడ్డి, పాలకుర్తి రాజు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, సునీల్, గౌస్ పాషా, రమేష్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఓరియంట్ అధికారులు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. కంపెనీ క్లబ్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టారు. కంపెనీ యూనిట్ హెడ్ మహేంద్రప్రతాప్‌జోషి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. అధికారులు, కార్మికులు 400లకుపైగా మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మహిళా మండలి అధ్యక్షురాలు ప్రీతిజోషి, సీనియర్ జీఎం ఆనంద్‌కులకర్ణి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు సత్యపాల్‌రెడ్డి, శరత్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం


శిక్షణను ప్రారంభిస్తున్న గని మేనేజర్

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై శుక్రవారం కార్మికులకు డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గని మేనేజర్ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ నెల 8న జరిగే ఇంటర్నల్, ఈపీ ఆపరేటర్ పోస్టులకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఆపరేటర్లకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంక్షేమాధికారి భార్గవ్, సర్వే ఆఫీసర్ ప్రకాష్, ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో కేంద్ర కార్యవర్గ సమావేశానికి హాజరు


ముజీబ్‌హుస్సేన్‌కు సభ్యుల సన్మానం

మంచిర్యాలటౌన్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించగా, జిల్లాకు చెందిన నాయకులు హాజరై, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ముజీబ్ హుస్సేన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్నం మల్లయ్య పాల్గొని మాట్లాడారు. పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని, 317 జీవో బాధితులను స్థానిక జిల్లాలకు పంపాలని, రెగ్యులర్ ట్రాన్స్‌ఫర్లను చేపట్టి, పీఆర్సీని అమలు చేసేలా చూడాలని కోరారు.